**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ,**

**తేది : 04 ఆగస్టు, 2023.**

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి,**

గౌరవ ముఖ్యమంత్రి,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,

అమరావతి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. **– జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి**

**విషయం : పోలవరం వరద ముంపు ప్రాంతాలను ఆదుకోవాలని కోరుతూ...**

**అయ్యా!**

రంపచోడవరం నియోజకవర్గం ఎటపాక, చింతూరు, కూనవరం, విఆర్ పురం మండలాల్లో ఇటీవల వచ్చిన వరద ప్రాంతాల్లో మా సిపిఎం బృందం ఈ రోజు పర్యటించింది. నాతో పాటు మా పార్టీ రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ తదితరులున్నారు. మీరు రేపు కూనవరం వస్తున్నట్లుగా మీడియాలో వార్తలు వచ్చాయి. మీ పర్యటన వాయిదా పడిందని తెలిసింది. మీరు వెళ్ళటానికి ముందు అక్కడ జరిగిన కొన్ని విషయాలను మీ దృష్టికి తీసుకురాదలిచాను.

సాధారణంగా గోదావరికి 4-5 ఏండ్లకు ఒకసారి వరదలొస్తాయి. కానీ ఈసారి వరుసగా వరదలొస్తున్నాయి. గత సంవత్సరం వరదలు మరవక ముందే మరల ఈ సంవత్సరం వచ్చాయి. అంత తీవ్రత లేనప్పటికీ ప్రజలను భయ భ్రాంతులకు గురి చేశాయి. దానికి కారణం పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ రావడమే.

35 అడుగులు భద్రాచలం దగ్గర ఉన్న సమయంలోనే నీళ్లు గ్రామాల్లో ప్రవేశించాయంటే దీన్ని గోదావరి సాధారణ వరదల కింద భావించటం సరైనది కాదు. ఈ గ్రామాలన్నీ కూడా పోలవరం రిజర్వాయర్ బ్యాక్ వాటర్ వల్ల మునిగినవే. ప్రభుత్వ లెక్కల ప్రకారం 41.15 కాంటూరు లోపే అనేక గ్రామాలు మునిగి పోతున్నందున వాటికి మొదటి దశలోనే పునరావాసం కల్పించాలని కోరుతున్నాను.

గోదావరి వరదల్లో మునిగిన గ్రామాలు అత్యధిక భాగం పోలవరం ప్రాజెక్టు వెనుక తట్టు ప్రాంతంలో బ్యాక్ వాటర్ వల్ల మునిగినవే అని చెప్పటానికి కావలసినన్ని సాక్ష్యాధారాలు ఉన్నాయి. నేను ఎటపాక మండలం వీరాయి గూడెం గ్రామాన్ని సందర్శించాను. మామూలుగా గోదావరి వరదల్లో భద్రాచలం వద్ద 42 అడుగుల వరకు వచ్చిన తర్వాత మాత్రమే ఈ గ్రామానికి వరద వస్తుంది. గత సంవత్సరం జూలైలో వచ్చిన వరదలకు గ్రామం పూర్తిగా మునిగిపోయింది. ఈ సంవత్సరం ఇప్పుడు వచ్చినటువంటి వరదల్లో చుట్టూ నీళ్లు వచ్చి గ్రామాన్ని దిగ్బంధనంలో ముంచింది. భద్రాచలం వద్ద 35 అడుగులకు చేరుకోవటానికి ముందే ఈ గ్రామంలోకి నీళ్లు వచ్చాయి. కేవలం పోలవరం వెనక తట్టు నీళ్ళు (బ్యాక్ వాటర్) రావడం వల్ల మాత్రమే వరద వచ్చింది. ఆ గ్రామస్తులకు రెండు వారాలుగా ఎలాంటి సహాయ సహకారాలు అందలేదు. ఆఖరికి బయటకు వచ్చి ఏదైనా వస్తువులు కొనుక్కొని వెళ్ళటానికి, తిండి గింజలు తీసుకోవడానికి అవసరమైన పడవలు కూడా ఇవ్వలేదు. 10 – 12 అడుగులు లోతున నీళ్లు ఊరు చుట్టూ చేరినందున బయటకు రాగలిగే స్థితి లేదు. 12 రోజుల తర్వాత కలెక్టరుకు విన్నవించుకున్నాక బోటు ఒకటి పంపించారు. ఆ బోటు వచ్చేటప్పటికి నీళ్లు తీయటం మొదలైంది. 12 రోజుల పాటు వారికి ఎలాంటి రిలీఫ్ అందలేదు. ఇప్పటికీ నిత్యావసరాలు ఇవ్వలేదు.

**.... 2వ పేజీ**

అలాగే ఎటపాక గ్రామంలో సైతం దళితులు అత్యధికంగా నివసించే లోతట్టు ప్రాంతాలు చుట్టూ నీళ్లు వచ్చినప్పటికీ వారికి నిత్యావసర సరుకుల సహాయం అందించలేదు. గత సంవత్సరం వరదల్లో ఈ ప్రాంతాలు పూర్తిగా మునిగిపోయాయి. గ్రామ వాలంటీర్లు ప్రజల సామాన్లు ఎత్తయిన ప్రాంతాలకు తరలించారు తప్ప రిలీఫ్ అందివ్వలేదు. పైన వర్షం.. కింద వరద .. వారు ఎలా బతికారో అర్థం చేసుకోగలరు.

ఈ సారి కూడా కూనవరం గ్రామానికి వరదలొచ్చాయి. గత సంవత్సరం వచ్చిన వరదల కన్నా తీవ్రత తక్కువగా ఉన్నప్పటికీ ఈ మండలంలో 45 కాంటూరులో ఉండేటువంటి అనేక గ్రామాలు 32వ కాంటూరు లోనే మునిగి పోయాయి. వూళ్ళోకి నీరు రాక పోయినా చుట్టూ నీరు చేరినా అలాంటి గ్రామాలను కూడా మునక గ్రామం క్రిందే గుర్తించాలి. శబరి పొంగి చింతూరు గ్రామాన్ని ముంచి వేసింది. పది రోజులపాటు శబరికి అటు ఇటు ఉన్న కాలనీలోని ప్రజలు హైస్కూల్లో ఆశ్రయం పొందారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చడం లోనూ, అక్కడ కనీస అవసరాలు తీర్చడం లోనూ ప్రభుత్వ యంత్రాంగం శ్రద్ధ పెట్టలేదు. కూనవరం, వి ఆర్ పురం గ్రామాలలో గుట్టల మీదకు చేరిన వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు.

శిబిరాల నుండి తిరిగి వెళ్లే వారికి మీరు ప్రకటించినట్లుగా రెండు వేలు కూడా ఇవ్వలేదు. మీరొస్తున్నారని ఇప్పుడు కూనవరంలో హడావుడి చేస్తున్నారు. ఇప్పటికీ అనేక మంది రోడ్ల మీదే నివాసం వున్నారు. ముందస్తు సహాయక చర్యల కోసం మీకు జూన్ 29వ తేదీనే ఉత్తరం రాశాను. అయినా బాధితులను గాలికి వదిలేయడం అత్యంత బాధాకరం.

కావున మునిగిన లేదా చుట్టూ నీరు చేరిన గ్రామాల ప్రజలందరికీ ఎలాంటి వివక్షత లేకుండా ప్రతి కుటుంబానికి పది వేలు సహాయం అందించాలని కోరుతున్నాను.

వరద బాధిత ప్రాంతంలో మీరు ప్రకటించిన ప్రభుత్వ సహాయం సత్వరమే అధికార యంత్రాంగం ద్వారా అమలు చేయించాల్సిందిగా కోరుతున్నాను. మొత్తం అన్ని మునక మండలాల్లో వర్గీకరణ చేయకుండా వరద సహాయం ప్రతీ గ్రామానికి, ప్రతి కుటుంబానికి ఇస్తామని మీరు చెప్పినట్లు ఈ రోజు కూడా మీడియాలో వచ్చింది. దాన్ని వెంటనే అమలు చేయించగలరు. తేడాలు లేకుండా వరద ప్రాంత గ్రామాలన్నింటికీ సత్వరమే మీరు ప్రకటించిన నిత్యావసరాలు అందించాలి. అన్ని మండలాల్లోను వరద నష్టాన్ని వెంటనే ఎన్యూమరేషన్ చేయించాలి. ఖచ్చితంగా ఆస్తి నష్టం అంచనా వేయాలి. నష్టపరిహారం ఇవ్వాలి. తక్షణ వైద్య సహాయం, శిబిరాలు నిర్వహించాలి. ఇప్పటివరకు బ్లీచింగ్ కూడా చేయలేదు. రోడ్ల మరమ్మత్తులు చేసి రాకపోకలు యధాస్థితికి తీసుకురావాలి. వరదలొచ్చినా ఆటంకం లేకుండా ప్రత్యామ్నాయ రహదారులు నిర్మించాలి.

మీరు కూనవరం సందర్శించినపుడు నేరుగా ఆ గ్రామానికి వచ్చి పోవడం కాకుండా భూ మార్గాన గ్రామస్తులను కలిసి క్షేత్రస్థాయి రిపోర్టుల ఆధారంగా వాస్తవాలు తెలుసుకొని వారి సమస్యలు పరిష్కరించేందుకు పూనుకుంటారని ఆశిస్తున్నాను.

అభివందనములతో...

**(వి.శ్రీనివాసరావు)**
రాష్ట్ర కార్యదర్శి